క్లుప్తంగా

పేద కుటుంబాలకు కల్యాణమస్తు భరోసా



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్

కోవెలకుంట్ల: పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు కల్యాణమస్తు పథకం ఆర్థిక భరోసా ఇస్తోందని వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన లావణ్య, జయలక్ష్మి, లక్ష్మిసుధ కుటుంబాలకు కల్యాణమస్తు పథకం ద్వారా మంజూరైన రూ. 2.50 లక్షలను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, వలంటీర్లు రాజు, సునీల్, మహేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఒంటెద్దు బండి పోటీలు



ఒంటెద్దుబండి రాతిదూలం లాగుతున్న వృషభం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. నిర్ణీత సమయంలో కోవెలకుంట్లకు చెందిన ధనుంజయ వృషభం 2,751 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో రూ. 10 వేలు కైవసం చేసుకుంది. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సుబ్బరాయుడు వృషభం 2,400, దొర్నిపాడు శ్రీనివాసులు వృషభం 2వేల అడుగులతో తర్వాత స్థానాల్లో రూ. 5వేలు, రూ. 3 వేలు బహుమతులు గెలుపొందాయి. వడ్డెమాను మధుసూదన్‌రెడ్డి, లావనూరు మహేశ్వరరెడ్డి, ముడిమేల సహదేవరెడ్డి ఆర్థిక సహకారంతో బహుమతులు అందజేశారు.

కృష్ణయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



కృష్ణయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఆవోపా వ్యవస్థాపకుడు కేఆర్ కృష్ణయ్య శెట్టి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి డోన్ ఆవోపా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు మాకం కృష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టిలు పిలుపునిచ్చారు. శనివారం కృష్ణయ్య జయంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు ఓలేటీ మాధవస్వామి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పూడిక తీత పనులు ప్రారంభం



పొక్లెయిన్‌తో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల : మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలోని ప్రధాన రహదారి ఎస్సీ కాలనీ మీదుగా వెళ్లే కాల్వలో పూడికతీత పనులను సర్పంచ్ నాగన్న ప్రారంభించారు. పొక్లెయిన్ ఏర్పాటు చేయించి పూడిక తీయిస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోకి నీరు చేరడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో పూడిక తీతతోపాటు కాల్వను కూడా విశాలంగా చేయిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.సమస్య పరిష్కారం కానుండడంతో కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా

బేతంచెర్ల: ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా నాయకులు ఈశ్వరయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొలుములపల్లె, బలపాలపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాకు కార్మికులు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కూలీల ఆన్‌లైన్ హాజరు యాప్‌ను రద్దు చేసి, పాత పద్ధతిని కొనసాగించాలని, సమ్మర్ అలవెన్సును అమలు చేయాలని కోరారు.

విత్తన శుద్ధి... దిగుబడులు వృద్ధి

- నలభై రోజుల వరకు చీడపీడలు ఆశించవు
- వేరుకుళ్లు, నారుకుళ్లు తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ప్యాపిలి: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. వేసవి దుక్కులు పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే భూసార పరీక్షల అనంతరం తమ పొలాల్లో ఏ పంట వేయాలనే విషయాన్ని ధ్రువీకరించుకున్న అనంతరం విత్తనశుద్ధి చేసుకోవడం తప్పనిసరి. విత్తనశుద్ధితో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. విత్తనశుద్ధితో దిగుబడులు పెరుగుతాయి. తెగుళ్ల బారి నుంచి పంటలు కాపాడుకునేందుకు విత్తనశుద్ధి ఎంతో దోహదపడుతుంది. వేరుకుళ్లు, నారుకుళ్లు వంటి తెగుళ్లను నివారించవచ్చును. విత్తనశుద్ధి చేయడం ద్వారా విత్తిన 40 రోజుల వరకు పంటలను ఎటువంటి చీడపీడలు ఆశించవు. తెగుళ్లు, క్రిమికీటకాల నుంచి మొక్కలు పూర్తిస్థాయిలో రక్షించబడతాయి. మొలక శాతం వృద్ధి చెందుతుంది. భూమిలో ఉండే శిలీంధ్రాలు, వేరు పురుగులను నివారించవచ్చు. మండలంలో 22 వేల హెక్టార్ల సాగుభూమి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రధానంగా వేరుశనగ, కందులు, ఆముదం, టమాట, పత్తి, సజ్జ తదితర పంటలు సాగు చేసేందుకు రైతన్నలు సమాయాత్తం అవుతున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులకు విత్తనశుద్ధిపై ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ప్యాపిలి వ్యవసాయ శాఖ అధికారి షేక్షావలి తన సిబ్బందితో కలిసి విత్తనశుద్ధి ప్రాముఖ్యతను వివరిస్తూ రైతులను చైతన్య పరుస్తునారు. పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తూ సాగు మెలుకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, అంతర పంటల ప్రయోజనాలను వివరిస్తున్నారు. వివిధ పంటలు సాగు చేసేముందు విత్తనశుద్ధి ఇలా చేయాల్సి ఉంటుంది.

- **వరి:** కిలో విత్తనానికి మూడు గ్రాముల కర్బండైజిమ్‌ను కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దంపనారుమళ్లకు అయితే లీటరు నీటికి ఒక గ్రాము కర్బండైజిమ్‌ను కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మందేకట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు మందునీరు సరిపోతుంది.
- **మొక్కజొన్న:** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్ అనే మందుతో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.
- **జొన్న:** కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- **పొద్దుతిరుగుడు:** విత్తనాలను విత్తేముందు 14 గంటలు నీటిలో నానబెట్టి తరువాత నీడలో ఆరబెట్టాలి. విత్తేముందు కిలో విత్తనానికి 2–3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. నెక్రోసిస్ తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.
- **ఆముదం:** కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కార్బండైజిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. విత్తన శుద్ధి చేయడం ద్వారా మొలక కుళ్లు తెగులు (ఫైటోప్తోరా బ్లైట్), ఆల్టర్‌నేరియా, ఆకు మచ్చ తెగులు, వడలు తెగులు అరికట్టవచ్చు.
- **కంది:** రైజోబియంను విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు.
- **సజ్జ:** కిలో విత్తనానికి 6 గ్రాముల అప్రాన్ 35 ఎస్‌డీతో విత్తనశుద్ధి చేసి పచ్చకంకి వెర్రి తెగులును నివారించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రతి సంవత్సరం వైఎస్సార్ పొలంబడి ద్వారా రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం . ఇందులో భాగంగా విత్తన శుద్ధి ఏఏ పంటలకు ఏ విధంగా చేయాలన్న విషయంపై గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో కంటే ప్రస్తుతం రైతులు విత్తనశుద్ధి పట్ల ఆసక్తి చూపుతున్నారు. జూన్ నెలలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా ఎక్కువ సంఖ్యలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

–షేక్షావలి, వ్యవసాయాధికారి, ప్యాపిలి

- **మిరప:** కిలో మిరప విత్తనానికి 150 గ్రాముల ట్రైసోడియం, ఆర్థోఫాస్ఫేట్‌తో విత్తన శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చు. 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను కలపడం ద్వారా రసం పీల్చే పురుగును నివారించవచ్చు. ఇతర తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- **వేరుశనగ:** కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెబ్ లేదా 1 గ్రాము కార్బండైజిమ్ పొడి మందును పట్టించాలి. వరి మాగాణుల్లో లేదా కొత్తగా వేరుశనగ సాగుచేసేవారు విత్తనానికి రైజోబియం కల్చరుని పట్టించాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కు వగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 6.5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిపాస్ లేక 2 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోపిడ్ చొప్పున కలిపి శుద్ధి చేయాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి ఆరబెట్టిన తర్వాత అవసరమైతే రైజోబియాన్ని కూడా విత్తనాలకు పట్టించాలి.

ఆంజనేయస్వామికి జలాభిషేకం

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం 108 కళశాలతో జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీకాంత్ శర్మ వేద మంత్రాలు చదువుతుండగా భక్తులు స్వామివారికి సామూహికంగా జలాభిషేకం చేసి, ఆకుపూజ చేశారు.

రేపటి నుంచి పెద్దమ్మ దేవర

కొలిమిగుండ్ల : మండలంలోని కమ్మవారిపల్లెలో పెద్దమ్మ దేవర రేపటి నుంచి రెండు రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగనుంది. 15న రాత్రి అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామ మధ్యలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 16న అమ్మవారిని దర్శించుకునేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దాదాపు 49 ఏళ్ల తర్వాత దేవర నిర్వహిస్తున్న నేపథ్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

కౌలురైతు కార్డులు ఇవ్వాలి

బేతంచెర్ల: మండలంలోని దేవాలయ భూములను కౌలుకు సాగు చేస్తున్న రైతులకు కౌలురైతు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, కార్యదర్శి సుధాకర్ కోరారు. ఈ మేరకు మద్దిలేటిస్వామి ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం పరిధిలో 600 ఎకరాలకుపైగా మద్దిలేటి స్వామి, పాలుట్ల రంగస్వామి, కొట్ట గడ్డ ఆంజనేయ స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయం భూము లు ఉన్నాయన్నారు. ఈ భూములు సాగు చేస్తున్న రైతులందరికీ కౌలు రైతు కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవి, లింగమ్మ, రఘు, మధు, పరమేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

- జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి అబ్దుల్ రెహమాన్
- లోక్ అదాలత్‌లో 432 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని కోవెలకుంట్ల జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి అబ్దుల్ రెహమాన్ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, సంజామల, రేవనూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాజీతో 432 కేసులు పరిష్కారమయ్యాయి. 27 క్రిమినల్, 380 ఎస్‌టీసీ, తొమ్మిది పీఎల్‌సీ, ఆరు అడ్మిషన్, నాలుగు ఓఎస్, డీవీసీ, ఎన్‌ఐ యాక్ట్, ఈపీకి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఆరికట్ల మల్లికార్జునరెడ్డి, తిరుపతయ్య, నరసింహులు, కాశీంసాహెబ్, శ్రీనివాసులు, రాజశేఖర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెగాలోక్ అదాలత్‌లో 941 కేసులు రాజీ

డోన్ టౌన్: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ కావడంతో 941 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తంగమని, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ హనీషాలు తెలిపారు. ఐపీసీ 125 కేసులు, ఎస్టీసీ 803, సీసీ అడ్మిషన్స్ 3, పిఎల్‌సీ 9, ఒక సూట్‌తో పాటు మొత్తం 941 కేసులకు సంబంధించి వాది, ప్రతివాదులు రాజీ కావడంతో కొట్టివేసినట్లు న్యాయమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు న్యాయవాదులు రవిమోహన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం ఉత్తమం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి కిశోర్‌కుమార్

బనగానపల్లెరూరల్: ఇరువర్గాల కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంతో పరిష్కారించుకోవడం ఉత్తమమని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కిశోర్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ మెగాలోక్ అదాలత్ జరిగింది. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారించుకున్న కేసులకు అప్పీలు ఉండదన్నారు. మొత్తం 246 కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, ఏజీపీ అబ్దుల్ ఖైర్, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, ఆజాంహుస్సేన్, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, జెమ్స్, శ్రీనివాసులు, అల్లావుద్దిన్, ఇర్ఫాన్ అబ్బాస్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సేవలు చిరస్మరణీయం



రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్యులు

డోన్ టౌన్: శాస్త్రవేత్తల సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, వారి సేవలు చిరస్మరణీయం అని ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరిడెంట్ డాక్టర్ అనురాధ, భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ అన్నారు. మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రోనాల్డ్ రాస్ ప్రయోగాల వలన నేడు మలేరియా వ్యాధి నుంచి సమాజాన్ని కాపాడుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధవి, శశికుమార్, కళ్యాణ్‌బాబు, రాజశేఖర్, ముజామ్ముల్, వెంకటేష్, హెడ్‌నర్స్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి కోట్ల వర్గీయుల రాజీనామా

డోన్ టౌన్: టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు కొచ్చెర్వు గ్రామానికి చెందిన మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి వర్గీయులు ధనలక్ష్మినాయక్‌తో పాటు నంద్యాల రాజు, గోరంట్ల లక్ష్మన్న, కత్తి రామాంజనేయులు, డ్రైవర్ శ్రీనివాసులు, నల్లబోతుల రాముడు, కొట్టాల శ్రీనివాసులు, దాసరి కిట్టు తదితరులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కోట్ల టీడీపీలో చేరడంతో తాము చేరామన్నారు. అయితే డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి మమ్ములను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. కోట్ల వర్గీయులు చాలా వరకు తీవ్ర అసంతృప్తి ఉన్నారని, వీరంత త్వరలో టీడీపీని వీడుతారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. దొర్నిపాడు మండలం అర్జునాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్ల వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. అటుగా వెళుతున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలోని రైల్వే స్టేషన్ సమీపాన నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ శనివారం తెలిపారు. నేనావత్ రాము నాయక్ నుంచి 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోటల్‌లో చోరీకి యత్నం

డోన్ టౌన్: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న శ్రీలేఖ హోటల్‌లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి ప్రయత్నించారు. హోటల్ షెట్టర్‌తోపాటు క్యాష్ కౌంటర్‌కు ఉన్న తాళాలు పగలగొట్టినట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. అయితే నగదు, వస్తువులు పోలేదని, దీంతా పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లెరూరల్ : భవన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో భవన కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 50 ఏళ్లు వయస్సు దాటిన భవన కార్మికుల సామాజిక పింఛన్ కింద నెలకు రూ.6 వేలను ప్రభుత్వం ఇవ్వాలని, ఇసుక పాలసివిధాన్ని పాతపద్ధతిలో కొనసాగించాలన్నారు. ఈ మేరకు 15న చేపట్టనున్న చలో కలెక్టరేట్‌కు భవన కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలహుస్సేని, వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

శ్రీమద్దిలేటిస్వామి ఆదాయం రూ.17,31,102



శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం ఆవరణంలో భక్తుల సందడి

బేతంచెర్ల: ప్రసిద్ధ వైష్ణవ పుణ్య క్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజామున ఆలయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం , ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.17,31,102 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

మద్దిలేటయ్య భక్తులకు మజ్జిగ పంపిణీ

మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు మద్దిలేటిస్వామి భక్తులకు శనివారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. వేసవి నేపథ్యంలో గ్రామ సమీపాన శిబిరం ఏర్పాటు చేసి మద్దిలేటయ్య ఆలయానికి వెళ్లే భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ. 2లక్షల విరాళం



నగదు అందజేస్తున్న కుమ్మరి శివయ్య దంపతులు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు రూ. 2,00, 232 విరాళం అందజేశారు. బనగానపల్లె పట్టణానికి చెందిన కుమ్మరి శివయ్య, లక్ష్మిదేవి దంపతులు 1,00,116 లక్షలు, కొలిమిగుండ్ల మండలం లోకేపల్లి బయమ్మ, మద్దిలేటి రూ.1,00,116 లక్షల ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడుకు శనివారం అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామివారి పట్టు వస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు లక్ష్మణ్ నాయుడు, రామచంద్రుడు, హనుమంత్ రెడ్డి, క్రిష్టారెడ్డి, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

18న డోన్‌లో మహాసభ

ప్యాపిలి: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 18న డోన్‌లో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా నాయకులు సుందరం, లక్ష్మయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, వెంకటేష్, తిమ్మయ్య కోరారు. ఈ మేరకు శనివారం స్థానికంగా వారు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ మేరకు డోన్‌లో చేపట్టనున్న జిల్లా స్థాయి భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకుడు గుండాల ఈశ్వరయ్య మాదిగ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోదండరాముడు, పరమేశ్, రవి, కోటేశ్వరరావు, పెద్ద సుంకన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: డోన్‌లో ఈ నెల 18న చేపట్టనున్న ఉమ్మడి జిల్లా మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా సమన్వయకర్త గుండాల ఈశ్వరయ్య, నాయకులు శేషు, శ్రీను, రామాంజనేయులు, నడ్డి శ్రీను, మధుసూధన్, ఎల్లయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

డోన్ టౌన్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గార్లపాటి మద్దిలేటి, కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్ ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

బనగానపల్లెరూరల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శనివారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. నాయకులు అల్లాబకాష్, ఫారూఖీ, గిరిజన సమాఖ్య నాయకుడు రాముడు, ఎమ్మార్పీఎస్ నాయకులు మునెయ్య, శివ, షఫీ పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు



బేతంచెర్ల పట్టణంలో ప్రధాన రహదారివెంట శరవేగంగా తారు రోడ్డు పనులు



తారు రోడ్డు వేయడంతో సౌకర్యంగా ప్రధాన రహదారి

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యల చెర్వు నుంచి కస్తూర్బా విద్యాలయం వరకు నాల్గులైన్ల రహదారి నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో సుమారు రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పట్టణంలో చేపట్టిన నాలుగులైన్ల విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ముఖ్యంగా అయ్యల చెర్వు నుంచి ప్రారంభమైన రహదారి పనులు పూర్తవ్వగా, బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా తారు రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. బనగానపల్లె రహదారిలో కస్తూర్బా విద్యాలయం వరకు పనులు పూర్తి అయ్యాయి. అయ్యల చెర్వులో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ ప్రజలతో పాటు వాహనదారులకు సౌకర్యంగా మారడమే కాకుండా ట్రాఫిక్ సమస్య పరిస్కారం కానుంది.

చురుగ్గా ఓహెచ్‌ఆర్‌సీ నిర్మాణ పనులు



రవ్వలకొండ పై నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్

బనగానపల్లె: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తుంది ప్రభుత్వం. జిల్లాలో ఎక్కడలేని విధంగా బనగానపల్లె నియోజకవర్గానికి ఈ పథకం కింద రూ.80 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలో ఎక్కడ తాగు నీటి సమస్యలేకుండా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో 80శాతం పనులు పూర్తికాగా మిగిలినవి చురుగ్గా సాగుతున్నాయి. సుమారు 12.500 గృహాలు, దాదాపు 50వేల జనాభా ఉన్న బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై రూ.1.58 కోట్లతో 2.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్, ఎన్జీవో కాలనీలో 1.18 కోట్లతో 2.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌ఆర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల చివర నాటికి వీటి నిర్మాణ పనులు పూర్తవుతాయిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తెలిపారు. రెండు మంచి నీటి పథకల ద్వారా సుమారు 80శాతం మేర మంచినీటి సమస్య తీరుతుందని, ఇక పట్టణంలో నీటి సమస్య ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. జూన్ ప్రారంభం నుంచి ఈ పథకాల ద్వారా నీటి సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.



ఎన్జీవో కాలనీలో రూ.1.18 కోట్లలతో నిర్మిస్తున్న ఓహెచ్‌ఆర్